దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ దోపిడీ

వన్..టు.. త్రీ..
అటెన్షన్ ప్లీజ్..!

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ పేరిట దోపిడీ చేస్తున్నారని మీకు తెలుసా..!. అవును మీరు చదివిందే నిజమే.. తూర్పుకోస్తాలో వసతులు, ఆదాయం పరంగా ముందు వరుసలో ఉన్న రైల్వే స్టేషన్ల కంటే ఇక్కడ పార్కింగ్ ఫీజు బాదేస్తున్నారు. రైలు దిగే వారిని పికప్ చేసుకుని వెళ్లడానికి వచ్చే ద్విచక్ర వాహనదారుల నుంచి కనీస చార్జీ కింద రూ.12 చొప్పున వసూలు చేస్తున్నారు. అధికారుల తీరువల్లే తమ జేబులకు చిల్లుపడుతుందని రైల్వే ప్రయాణికులు మండి పడుతున్నారు.

- వసతులు పూజ్యం.. రుసుము భారం
- తూర్పు కోస్తాలోనే అధికంగా వసూలు
- అధికారుల తీరుతో ప్రయాణికుల జేబులకు చిల్లు
- ద్విచక్రవాహనానికి కనీస చార్జీ రూ.12



ఒకటో ప్లాట్‌ఫారం వైపు ఆరుబయట పార్కింగ్ చేసిన వాహనాలు

ఒక వైపే షెడ్లు

చాలా రైల్వేస్టేషన్లలో పార్కింగ్ షెడ్లు ఉంటాయి. దువ్వాడలో నాలుగో నంబర్‌ప్లాట్‌ఫారం వైపు ద్విచక్రవాహనాలకు మాత్రమే షెడ్ అందుబాటులో ఉంది. నాలుగు చక్రాల వాహనాలతో పాటు ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వైపు నిలిపే వాహనాలు ఎండకు ఎండి, వానకు తడవాల్సిన పరిస్థితి ఉంది.

స్టేషన్ల వారీగా పార్కింగ్ ఫీజు వ్యత్యాసం ఇలా..

రైల్వేస్టేషన్	12 గంటలకు	24 గంటలకు
దువ్వాడ	రూ. 48	రూ. 72
కటక్	రూ. 20	రూ. 60
ఖుర్ధారోడ్డు	రూ. 20	రూ. 60
సంబల్‌పూర్	రూ. 12	రూ. 15
పలాస	రూ. 20	రూ. 55



దువ్వాడ రైల్వేస్టేషన్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ ఫీజుతో కోట్ల రూపాయల దోపిడీకి తెరలేపిన వారిపై కఠిన చర్యలు తీసుకొని 'ఫీజు'లుం లెక్కలు సరిచేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలో దువ్వాడ రైల్వేస్టేషన్ ఆదాయం ఆధారంగా ఎన్ఎస్‌జీ-5 (నాన్ సబర్బన్ గ్రూపు)లో ఉంది. దువ్వాడ కంటే ఆదాయం ఎక్కువ ఉన్న సంబల్‌పూర్, కటక్, ఖుర్దారోడ్, పలాస వంటి రైల్వేస్టేషన్లు ఎన్ఎస్‌జీ-3 గ్రూపులో ఉన్నాయి. ఆ స్టేషన్ల నుంచి ప్రయాణికులతో పాటు గూడ్స్ రవాణా జరుగుతోంది. దువ్వాడ రైల్వేస్టేషన్ కంటే వసతులు రెట్టింపుస్థాయిలో ఉన్నాయి. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ప్రలోభాలాకు తలొగ్గిన అధికారులు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ ఫీజులు అధికంగా ఖరారు చేస్తూ దోపిడీకి లైన్ క్లియర్ చేశారు.దీనిపై ప్రయాణికులు, దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులు మండిపడుతున్నారు.

వ్యత్యాసం ఎందుకు?

ఎన్ఎస్‌జీ-3 స్టేషన్లలో కూడా లేని పార్కింగ్ ఫీజు దువ్వాడలో ఖరారు చేసి దోపిడీ చేయడానికి ఎవరు సహకరించారు. ఎందుకు రెండింతలు పెంచి వసూలు చేసుకొనే వెసులుబాటు కల్పించారో లెక్కలు తేల్చాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం నుంచి మిగిలిన ప్లాట్‌ఫారాలపైకి వృద్ధులు, దివ్యాంగులు చేరుకోవడానికి బ్యాటరీ కార్ట్ ఉంది.దీనికి కూడా ఒకరికి రూ.48 చొప్పున వసూలు చేస్తున్నారు.

కనీస సమయం ఏది?

తూర్పు కోస్తా పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో కనీసం రెండు గంటల సమయం పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో రూ.కనీస చార్జీ 5 గా ఉంది. దువ్వాడలో మాత్రం తన బంధువు, లేదా స్నేహితులను తీసుకొని ద్విచక్రవాహనంపై స్టేషన్‌కు వచ్చి పార్కింగ్ చేస్తే కనీసం రూ.12 చెల్లించాలి. అదే 2 గంటల వ్యవధిని కూడా ఇక్కడ నిర్ణయించి ఉంటే అంత మొత్తం చెల్లించాల్సిన అవసరం ఉండదని ప్రయాణికులు అంటున్నారు.



పార్కింగ్ చార్జీలు తగ్గించాలి

తూర్పు కోస్తా రైల్వే జోన్‌లో ఏ రైల్వేస్టేషన్‌లో లేని విధంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఆదాయంలో, వసతుల్లో దువ్వాడ కంటే మెరుగ్గా ఉన్న రైల్వేస్టేషన్లలో కూడా ఇంతలా ఫీజులు లేవు. దువ్వాడలో ఎందుకు ఇలా నిర్ణయించారో అధికారులకే ఎరుక. పార్కింగ్ రుసుము విషయమై ఇప్పటికే డీఆర్‌ఎం, కమర్షియల్ అధికారులతో చర్చించాను.

-కె.ఈశ్వర్, రైల్వే జోన్ యూజర్స్ కన్సల్టెన్సీ సభ్యుడు



పార్కింగ్ షెల్టర్లు నిర్మించాల్సిందే

జోన్ పరిధిలో ఏ స్టేషన్‌లో లేనివిధంగా పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారు. అయినా కనీసం షెల్టర్లు నిర్మించాలనే ఆలోచన చేయకపోవడం అన్యాయం. వెంటనే పార్కింగ్ షెడ్లు నిర్మించాలి. రైల్వే టికెట్ ధర కంటే పార్కింగ్ ఫీజులే అధికంగా ఉండడం వల్ల సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రయాణికులు భారంగా భావిస్తున్నారు. వెంటనే ధరలు తగ్గించాలి.

- కాటం చంద్రరావు, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు



వసతులు అంతంతమాత్రమే..

పార్కింగ్‌కు సరైన వసతులు లేవు. రైల్వేజోన్‌లో ఏ స్టేషన్‌లో కూడా ఇంత పెద్ద మొత్తంలో పార్కింగ్ రుసుము వసూలు చేయడం లేదు. అధికారులు ఏ ప్రలోభాలకు తలొగ్గి ఇలా దోపిడీకి అవకాశం కల్పించారో విచారించి బాధ్యులను శిక్షించాలి.

- కె.వీర్రాజు, దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ కోశాధికారి

క్లుప్తంగా

చర్చిల ముస్తాబు



కాంతులీనుతున్న షీలానగర్‌లోని హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చి

అక్కిరెడ్డిపాలెం: క్రిస్మస్ సందడి వచ్చేసింది. అక్కిరెడ్డిపాలెం ప్రాంతంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. షీలానగర్‌లోని హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చి రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలి



సభలో పాల్గొన్న నాయకులు

గాజువాక: వచ్చేనెల 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు కుటుంబ సమేతంగా విచ్చేసి జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకుడు ఓలేటి సత్యనారాయణ కోరారు. గాజువాక లంకా మైదానంలో ఆదివారం నిర్వహించిన హిందూ మహాసభలో ఆయన మాట్లాడారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు గాయత్రి స్వామి, కరణంరెడ్డి నర్సింగరావు, బాటా శ్రీను, కృష్ణ, సంతోష్, సిరసపల్లి నూకరాజు, దీనంకొండ కృష్ణంరాజు, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

గాయకులను ప్రోత్సహిస్తాం



ఉచిత శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సాయినాథ్ సింగర్స్ గ్రూపు ప్రతినిధులు

అగనంపూడి: సరైన గాత్రం ఉండి పాటలు పడాలనే ఉత్సాహం ఉన్న గాయలకులకు తగిన ప్రోత్సాహం అందించడానికి సాయినాథ్ సింగర్స్ గ్రూపు ఏర్పాటు చేశామని నిర్వాహకులు వై.వేణుగోపాలరావు, పి.భాస్కరరావు చెప్పారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సంగీతం, పాటలు పాడడంలో ఉత్సాహం, శ్రద్ధ చూపేవారిని ప్రోత్సహిస్తామన్నారు. పాటల పట్ల ఉత్సాహం, ఆసక్తి ఉన్న గాయకులు పేర్లను 86885 85444 నంబర్‌లో నమోదు చేసుకోవాలని వారు కోరారు.

బాధిత కుటుంబానికి బాసట



నిత్యావసర సరకులు అందజేస్తున్న అండిబోయిన లక్ష్మి, అప్పారావు తదితరులు

పెదగంట్యాడ: క్యాన్సర్ కారణంగా మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి అండగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పిట్టవానిపాలేనికి చెందిన అండిబోయిన రమణ అనే వ్యక్తి ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది.సమాచారం అందుకున్న యాత శెట్టిబలిజ గౌడ ఈడిగ శ్రీశైన సంక్షేమ సేవా సంఘం వైస్ చైర్మన్ అండిబోయిన అప్పారావు, ప్రధాన కార్యదర్శి వనుము నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. మృతుని భార్య లక్ష్మికి నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో అండిబోయిన వెంకటరమణ, బత్తిన రాము, దొమ్మేటి అప్పలరాజు, అండిబోయిన శ్రీను, అచ్చంనాయుడు, సన్యాసిరావు పాల్గొన్నారు.

వస్త్ర ప్రదర్శన ప్రారంభం



ఉక్కుక్లబ్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న ఉక్కు నగరవాసులు

ఉక్కునగరం: ఉక్కు అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం (ఉక్కునగరం క్లబ్)లో వస్త్ర ప్రదర్శన ఆదివారం ప్రారంభమైంది. సంక్రాంతి సందర్భంగా దేశంలోని వివిధ ప్రముఖ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను క్లబ్ కార్యదర్శి రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత కలిగిన వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. నిర్వాహకుడు కుందన్ మాట్లాడుతూ జనవరి 20 వరకు నిర్వహించనున్న ప్రదర్శనలో రేమండ్స్, పార్క్ ఎవిన్యూ, కలర్ ప్లస్ వంటి ప్రముఖ బ్రాండ్లకు చెందిన వస్త్రాలు అందుబాటులో ఉంచామన్నారు. పురుషులకు చెందిన షర్టులు, ప్యాంటులు, జీన్స్, టీ షర్టులు, షార్టులు, పార్టీవేర్ షర్టులు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ భూతం కోరలు చాచుతుందని, మానవాళి దీనికి దూరంగా ఉండకపోతే మానవులు, జంతువులు, పక్షులు బలికాక తప్పదని తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు అన్నారు. 87వ వార్డు కణితి సమీపంలో తిరుమలనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాయగూరల దుకాణాలు, చేపల మార్కెట్, చికెన్, మటన్ దుకాణాల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. గుడ్డ, నార సంచులను ప్రదర్శించారు. కిరాణా, కూరగాయలు, మాంసం, చికెన్, చేపల దుకణాలకు ప్లాస్టిక్ సంచులు బదులు నార, గుడ్డ సంచులతో పాటు స్టీల్ డబ్బాలతో వెళ్లాలని కోరారు. దుకాణదారులు ప్లాస్టిక్ సంచులను ఇవ్వొద్దని, వ్యాపారులు అమ్మకాలు చేయొద్దని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరమానందం, భాస్కరరావు, వసంతరెడ్డి, శ్రీరాములు, రాజు, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

హైస్కూల్ గ్రౌండ్‌లోకి నో ఎంట్రీ

నిరాశగా వెనుదిరిగిన చిన్నారులు

గాజువాక: గాజువాక హైస్కూల్ మైదానంలోకి ఇతరుల ప్రవేశాన్ని ఆదివారం నిలిపివేశారు. ఎప్పటిలాగే గ్రౌండ్‌కు వచ్చిన చిన్నారులు స్కూల్ గేటు మూసి ఉండటంతో వెనుదిరగక తప్పలేదు. 67వ వార్డులోని గాజువాక హైస్కూల్ పరిసర గ్రామాలు, కాలనీలకు ప్రత్యేకంగా మైదానాలు లేవు. దీంతో చిన్నారులు ఆడుకోవడానికి, స్థానికులు వాకింగ్ కోసం ఈ గ్రౌండ్‌కు వస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గతంలో ఈ మైదానంలో కబడ్డీ కోర్టులు కూడా ఏర్పాటు చేశారు. ఆదివారం కావడంతో ఎప్పటిమాదిరిగానే చిన్నపిల్లలు, స్థానికులు మైదానానికి వచ్చినప్పటికీ గేటు తెరవకపోవడంతో వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ మాజీ చైర్ పర్సన్ చినతల్లి పాఠశాల వద్దకు వచ్చి స్థానికులతో మాట్లాడారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి ఫోన్ చేసి స్థానికులను గ్రౌండ్‌లోకి అనుమతించాలని కోరారు. అయితే ఇతరులను స్కూల్ గ్రౌండ్‌లోకి అనుమతించవద్దని ఆదేశాలుండటం వల్ల తాము అనుమతించలేమని ప్రధానోపాధ్యాయురాలు చెప్పినట్టు చినతల్లి పేర్కొన్నారు.



హైస్కూల్ గేటు వద్ద ఎదురు చూస్తున్న చిన్నారులు

రెండు గంటల పాటు అనుమతిస్తాం

కాగా, ఈ విషయంపై ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతిని సంప్రదించగా గ్రౌండ్‌లోకి ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు అనుమతిస్తామని చెప్పారు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు స్టడీ అవర్‌లు నడుస్తున్నందున ఇతరులను అనుమతించలేమని పేర్కొన్నారు. ఇతరులు మైదానంలోకి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. గాజువాక పోలీసులు కూడా ఇతరుల ప్రవేశాన్ని పరిమితం చేయాలని సూచించారన్నారు.

ఘనంగా సండే క్రిస్మస్ ఫెస్ట్



యునైటెడ్ బాప్టిస్ట్ చర్చిలో చిన్నారుల సందడి

గాజువాక: గాజువాకలో క్రిస్మస్ సందడి మొదలైంది. పట్టణంలోని చర్చిలు, ప్రార్థనా మందిరాలు ప్రత్యేక అలంకరణతో తళతళలాడుతున్నాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకొని కొత్తగాజువాక బీసీ రోడ్‌లోని యునైటెడ్ బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం సండే క్రిస్మస్ ర్యాలీ నిర్వహించారు. చర్చి అధ్యక్షుడు పుచ్చా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు కార్యక్రమాలు క్రిస్మస్ సందేశం తెలియజేసే నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో చర్చి కార్యదర్శి బీఎస్ఎస్ఎన్ మనోహర్, కోశాధికారి ఎబ్బెయ్ మోసెస్, ఉపాధ్యక్షుడు పి.ఆనందరావు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి తిరువీధి

అక్కిరెడ్డిపాలెం: స్వామి అయ్యప్ప తిరువీధి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. షీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ఆదివారం అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించిన వాహనంలో ప్రతిష్ఠించి ఊరేగించారు. ఏటాస్వామి అయ్యప్పకు లక్ష పుష్పార్చన చేపట్టి మరుసటి రోజు స్వామి విశిష్టతను తెలియజేస్తూ తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్నట్టు స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు ఎస్ఏ.నాయుడు తెలిపారు. షీలానగర్ అయ్యప్ప దేవాలయం నుంచి ప్రారంభమైన తిరువీధి అక్కిరెడ్డిపాలెం, రాంనగర్, భెల్ టౌన్ షిప్, నాతయ్యపాలెం, హరిజనజగ్గయ్యపాలెం, వేంకటేశ్వరకాలనీ, షీలానగర్, గవరజగ్గయ్యపాలెం వరకూ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు పీపీ కృష్ణ నంబూద్రి, భక్తులు చరపాక నాగార్జున, నంబారు రాజు, డి.వెంకటాద్రి, ఎస్.విశ్వేశ్వరరావు, అదపాక వెంకటరమణ, గోపిశెట్టి అప్పలరాజు, ఎస్.ఆర్.వైద్యనాథన్, అలోక్ శుక్ల, రామ్ సేవక్ పాల్గొన్నారు.



తిరువీధోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా సత్యసాయి మందిరం వార్షికోత్సవం



మహిళలకు కుట్టుమిషన్ అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ గణేష్

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా, ఆధ్యాత్మిక మందిరం వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మందిరం 24వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం వేద మంత్రం, నామసంకీర్తనలు, భజనలు నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్, సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్. నాయుడు మాట్లాడుతూ ప్రేమతో కూడిన నిస్వార్థ సేవలకు ప్రతిరూపం సత్యసాయి సేవా సంస్థలు అన్నారు. కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుడికి ట్రై సైకిల్, పేద మహిళకు కుట్టు మిషన్ అందించారు. మహిళలకు నెలవారీ కిరాణా సామగ్రితో కూడిన అమృత కలశాలు అందజేశారు. సమితి కన్వీనర్ జి. రామకృష్ణ వార్షిక నివేదిక అందజేశారు. సత్యసాయి సేవా సమితి గాయనీ గాయకుల సంగీత విభావరి అలరించింది.

అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి దాతల విరాళాలు



ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళాలు అందజేస్తున్న దాతలు ఆకుల దేముడు అండ్ సన్స్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల ఆలయానికి దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం ఆకుల దేముడు అండ్ సన్స్ (లేటు పిల్లా పెంటయ్య) వారసులు రూ.30,116, మేడిశెట్టి నరసింగరావు, వెంకటి దంపతులు రూ.10,021, నాతయ్యపాలెంకు చెందిన జీవీఎంసీ కాంట్రాక్టరు పల్లెల వెంకటరమణ రూ.10,101, గొల్లవిల్లి చేతన్ (బిల్డర్) రూ.10,000 చొప్పున ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. వీరికి ఆలయ కమిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

నేత్రపర్వం.. వెంకన్న కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న ఆగమ పండితులు

గాజువాక: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులతో స్థానిక శ్రీనగర్‌లో నిర్వహించిన శ్రీవారి కల్యాణోత్సవాన్ని వేలాదిమంది భక్తులు కనులారా వీక్షించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో చిన్నారుల కూచిపూడి నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, లారీ, ట్రక్ సప్లయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఫ్లైయాష్ లారీల అడ్డగింత

పెదగంట్యాడ: ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి లారీల్లో తరలిస్తున్న యాష్ రోడ్డుపై కారుతోందని.. అది ఎండకు ఎండిన తర్వాత గాలి వీచినప్పుడల్లా ధూళి రూపంలో రేగుతోందని పిట్టవానిపాలెం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అది పీల్చడంతో చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని వాపోతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం ఎన్టీపీసీ నుంచి లారీల్లో అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను మరడ దాసరిపేట వద్ద గ్రామస్తులు అడ్డుకున్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు యాష్ పాండ్‌లోని యాష్ మొత్తం తడిసిపోయిందని, తడి యాష్‌ను లారీల్లో లోడు చేయడంతో అది కాస్తా దారి పొడుగునా కారుతోందన్నారు. రోడ్డుపై పడిన యాష్ వల్ల ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి పడిపోతున్నారని పిట్టవానిపాలేనికి చెందిన బట్టు అప్పలరెడ్డి, పిట్ట సంజీవరెడ్డి తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



లారీలను అడ్డుకున్న పిట్టవానిపాలెం గ్రామస్తులు

26 నుంచి సీపీఐ శత వార్షికోత్సవాలు



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ తదితరులు

పెదగంట్యాడ: ఈ నెల 26 నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవాలు నిర్వహించనున్నామని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అన్నారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో శత వార్షికోత్సవాలకు సంబంధించిన ప్రత్యేక సంచికను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు బీచ్ రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఆర్కే బీచ్ వరకూ కవాతు నిర్వహించనున్నామని తెలిపారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.ఆనంద్, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, దుర్గారావు, పోతయ్య పాల్గొన్నారు.